## 107. సూరహ్ అల్-మా'ఊన్

سُورَةُ الْمَاعُونِ

అల్-మా'ఊన్ : ఉపకారం, సహాయం, తోడ్పాటు, Assistance, మొదటి మక్కా కాలపు ఈ సూరహ్ పేరు 7వ ఆయత్ నుండి తీసుకోబడింది. దీని ఇతర పేర్లు సూరహ్ **అద్-దీన్**, **అరఅ'య్‌త** లేక **అల్-యతీమ్** (ఫ'త్హ్ అల్-ఖదీర్). బహుశా ఇది సూరహ్ అత్-తకాసు'ర్(102) తరువాత అవతరింపజేయబడింది. ఇందులో **7 ఆయతులు**న్నాయి.

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ ○

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

أَرَأَيْتَ الَّذِي يُكَذِّبُ بِالدِّينِ ۝١

**1**. తీర్పు దినాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా?[1]

فَذَٰلِكَ الَّذِي يَدُعُّ الْيَتِيمَ ۝٢

**2**. అతడే అనాథులను కసరికొట్టే వాడు;[2]

وَلَا يَحُضُّ عَلَىٰ طَعَامِ الْمِسْكِينِ ۝٣

**3**. మరియు పేదవాళ్ళకు అన్నం పెట్టమని ప్రోత్సహించనివాడు.

فَوَيْلٌ لِّلْمُصَلِّينَ ۝٤

**4**. కావున, నమా'జ్ చేసినా, (ఇటువంటి) వారికి వినాశం తప్పదు![3]

الَّذِينَ هُمْ عَن صَلَاتِهِمْ سَاهُونَ ۝٥

**5**. ఎవరైతే తమ నమా'జ్‌లపట్ల అశ్రద్ధ వహిస్తారో![4]

الَّذِينَ هُمْ يُرَاءُونَ ۝٦

**6**. ఎవరైతే ప్రదర్శనాబుద్ధితో వ్యవహరిస్తారో (నమా'జ్ సలుపుతారో)![5]

---

**1**. ఈ ఆయత్ దైవప్రవక్త ('స'అస)ను సంబోధిస్తోంది. దీన్ - అంటే పునరుత్థాన (తీర్పు) దినం. చూడండి, 109:6.

**2**. ఎందు కంటే అతడు పిసినారి, తీర్పుదినాన్ని విశ్వసించనివాడు మరియు ఇహలోకంలో చేసిన పుణ్యాలకు పరలోకంలో లభించే ప్రతి ఫలాన్ని విశ్వసించనివాడు.

**3**. అనాథులను కసరి కొట్టేవారికి, ఆకలిగొన్న పేదలకు అన్నం పెట్టనివారికి, నమా'జ్ చేయని వారికి 'వైల్' అనే నరకమే నివాసస్థలమవుతుంది. ఎందుకంటే వారు కపట విశ్వాసులు, హృదయపూర్వకంగా కాక ఇతరులకు చూపటానికే నమా'జ్ చేసేవారు.

**4**. ఇలాంటి వారు అసలు నమా'జ్ చేయరు. ఒకవేళ చేసినా అశ్రద్ధతో చేస్తారు, నిర్ణీత సమయంలో చేయరు. భయభక్తులతో నమా'జ్ చేయరు. చూడండి, 4:142.

**5**. అంటే ఇతరులతో ఉన్నప్పుడు వారి మెప్పు పొందటానికి నమా'జ్ చేస్తారు. ఏకాంతంలో ఉంటే నమా'జ్‌ను వదలిపెడతారు.

وَيَمْنَعُونَ الْمَاعُونَ ۝

7. మరియు ఎవరైతే (ప్రజలకు) సామాన్య ఉపకారం చేయటానికి కూడా నిరాకరిస్తారో![1]

## 108. సూరహ్ అల్-కౌస'ర్

سُورَةُ الْكَوْثَرِ

అల్-కౌస'ర్: అంటే అధికం, Good in Abundance, పుష్కలత్వం, సమృద్ధి. ఈ సూరహ్ మరొక పేరు సూరహ్ అన్-నహ్ర్. చాలామంది ఇది మొదటి మక్కా కాలపు సూరహ్ అని అంటారు. దీనిపేరు మొదటి ఆయత్ నుండి తీసుకోబడింది. ఇందులో 3 ఆయతులు ఉన్నాయి.

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ ۝

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

إِنَّا أَعْطَيْنَاكَ الْكَوْثَرَ ۝

1. (ఓ ము'హమ్మద్!) నిశ్చయంగా, మేము నీకు కౌస'ర్[2] ప్రసాదించాము.

فَصَلِّ لِرَبِّكَ وَانْحَرْ ۝

2. కనుక, నీవు నీ ప్రభువు కొరకే నమా'జ్ చెయ్యి మరియు బలి (ఖుర్బానీ) కూడా (ఆయన కొరకే) ఇవ్వు![3]

إِنَّ شَانِئَكَ هُوَ الْأَبْتَرُ ۝

3. నిశ్చయంగా నీ శత్రువు, వాడే! వేరు తెగినవాడిగా (వారసుడూ, పేరూ లేకుండా) అయిపోతాడు.[4]

---

1. మ'అనున్: అంటే కొద్దిపాటి సామాన్య చిన్న చిన్న సహాయాలు. ఇంట్లోవాడే వస్తువులను ఒకరి కొకరు ఇచ్చుకోవటం. చిన్న చిన్న సహాయాలు చేసుకోవటం.
2. కౌస'రున్: అంటే అధికం. ఇబ్నె-కసీ'ర్ ఇక్కడ: 'ఖైరున్ కసీ'రున్ - అత్యధికమైన మేలు - అనే అర్థానికి ప్రాధాన్యత నిచ్చారు. 'స'హీ'హ్ 'హదీస్'లో - కౌస'ర్ - అనేది స్వర్గంలో దైవప్రవక్తకు ప్రసాదించబడే ఒక సెలయేరు, అని చెప్పబడింది. మరి కొందరు అదొక సరోవరం అన్నారు. 'ఖైరున్ కసీ'రున్ అనేపదం వీటన్నిటినీ సూచిస్తుందని ఇబ్నె- కసీ'ర్ అంటారు.
3. నమా'జ్ మరియు బలి (ఖుర్బానీ) ఆ ఒకేఒక్క ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.) కొరకే చేయాలి. నహ్ర్ - అంటే ఒంటె మెడలో కత్తి పొడిచి దాని రక్తనాళం కోయటం. వేరే పశువులను భూమి మీద పడవేసి వాటి మెడ రక్తనాళాలను కోస్తారు. దీనిని - జిబ్'హ్ - అంటారు. ఇక్కడ నహ్ర్, బలి (ఖుర్బాని) అంటే 'హజ్జ్ లేక 'ఈద్-అజ్'హా సందర్భంగా లేక సదఖ - దానం - కొరకు చేసే జిబ్'హ్ లు కూడా.
4. అబ్'తరు: అంటే, వారసుడు లేకుండా మరియు పేరు ప్రతిష్ఠలు లేకుండా అయిపోవటం. అతని వెంటనే అతని వంశం అంతమవటం లేక అతని పేరు తీసుకొనేవాడు ఎవ్వడూ లేకపోవటం. దైవప్రవక్త ('స'అస)కు మగ సంతానం బ్రతికి లేనందుకు అతని ('స'అస) విరోధులు అతనిని ('స'అసను) అబ్'తర్ అని ఎత్తి పొడిచేవారు. అప్పుడు అల్లాహ్ (సు.తా.) ఈ ఆయత్ అవతరింపజేశాడు. మరియు అది నిజమని నిరూపించాడు.